బెంగళూరులో ముదిరిన

నీటి సంక్షోభం

- మాల్స్‌లోని మరుగుదొడ్లను ఉపయోగిస్తున్న ప్రజలు
- రెండు రోజులకోసారి స్నానాలు
- ఇంట్లో వంట మానేసి ఫుడ్ ఆర్డర్స్
- పాఠశాలలు, కోచింగ్ సెంటర్ల మూసివేత
- కొవిడ్ తరహాలో ఆన్‌లైన్ క్లాసులు
- కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ యుద్ధం

బెంగళూరు, మార్చి 15: బెంగళూరులో నీటి సంక్షోభం రోజు రోజుకూ ముదిరిపోతున్నది. మునుపెన్నడూ లేనంతగా నీటి కొరత ఏర్పడటంతో ప్రజలు ఇంట్లో వంట వండుకోవడం మానేసి రెస్టారెంట్ల నుంచి ఆర్డర్ చేసుకుంటున్నారు. అంతే గాక రెండు రోజులకోసారి స్నానాలు చేస్తున్నారు. ఇక మరీ ఘోరంగా మాల్స్‌లోని టాయిలెట్లను ఉపయోగించటం మొదలెట్టారు. సిలికాన్ వ్యాలీగా పేరున్న బెంగళూరు మహానగర దుస్థితి ఇది. నీటి సంరక్షణ వ్యవస్థ ఉన్న బహుళ అంతస్తుల భవనాల్లో ఉన్నవారు కూడా ఇప్పుడు వారి కనీస నీటి అవసరాలు తీర్చుకోవటానికి వాటర్ ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. ఇక ఆహార పదార్థాలు తినటానికి, కాఫీలు, టీలు తాగటానికి డిస్పోజబుల్ కప్పులు, గ్లాసులు, ప్లేట్లు వినియోగిస్తున్నారు. నగరంలోని కోచింగ్ సెంటర్లు వారం రోజుల పాటు సెలవులు ప్రకటించి ఆన్‌లైన్ తరగతులకు హాజరు కావాలని కోరుతున్నాయి. వారానికొకసారి వాషింగ్ మెషిన్లను ఉపయోగిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరోసారి వర్క్ ఫ్రం హోం కోరతామని, వర్షాలు పడే వరకు తాత్కాలికంగా తమిళనాడులోని మా స్వస్థలానికి వెళ్లిపోవాలనుకుంటున్నట్టు కొంత మంది బెంగళూరు వాసులు తెలిపారు. గత కొంత కాలంగా వర్షాలు లేకపోవటంతో ఈ దుర్భిక్షం దాపురించింది.

బెంగళూరు నగరానికి ప్రతి రోజు 2,600-2,800 మిలియన్ లీటర్ల నీరు అవసరం కాగా.. ప్రస్తుతం అందులో సగం నీరు కూడా సరఫరా కావటం లేదు. బెంగళూరు శివార్లలోని 110 గ్రామాలు కూడా నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ఈ నీటి సంక్షోభం అటు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ యుద్ధంగా మారింది. లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందిస్తూ బీజేపీ నిరసనలకు దిగింది. బీజేపీ పాలిత ఫెడరల్ ప్రభుత్వం కరువు పీడిత కర్ణాటకకు ఆర్థిక సాయం చేయడం లేదని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది.

'అటవీ హక్కుదారుల అభివృద్ధిని అడ్డుకోవద్దు'

న్యూఢిల్లీ, మార్చి 15: అటవీ హక్కుదారులు అయిన వారి సామాజిక, ఆర్థిక పురోగతికి రాష్ట్ర ప్రభుత్వాలు ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొంటూ ఆయా రాష్ట్రాలకు కేంద్రం లేఖ రాసింది. విద్య, వైద్యం, మంచినీటి వసతి తదితర మౌలిక సదుపాయాల కల్పనకు అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ), 2006ను సక్రమంగా అమలు చేయటానికి సమగ్ర మార్గదర్శకాలను కేంద్రం లేఖలో పేర్కొన్నది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు సంయుక్తంగా లేఖలు రాసింది.

నేడే సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్

మొదటిపేజీ తరువాయి...

సమావేశం నిర్వహించి షెడ్యూల్ ప్రకటించనున్నది. శుక్రవారం ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధి ఒకరు సోషల్‌మీడియా 'ఎక్స్' వేదికగా అధికారికంగా వెల్లడించారు. లోక్‌సభతో పాటు, ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికల తేదీలను కూడా ప్రకటించనున్నారు. ప్రస్తుత లోక్‌సభకు జూన్ 16వ తేదీతో గడువు ముగియనున్నది. ఈసీ డాటా ప్రకారం..అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీల గడువు జూన్ 2వ తేదీతో, ఆంధ్రప్రదేశ్-జూన్ 16వ తేదీతో, ఒడిశా అసెంబ్లీ గడువు జూన్ 24వ తేదీతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకు ఈ ఏడాది మేలోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందుకోసం ఇటీవల దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పర్యటించిన ఈసీ..స్థానిక రాజకీయ పార్టీలు, క్షేత్రస్థాయిలో అధికారులతో విస్తృత సమావేశాలు నిర్వహించింది. అనంతరం షెడ్యూల్‌ను సిద్ధం చేసింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే 'మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్' అమల్లోకి రానున్నది. కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే అధికారంలో ఉన్న పార్టీలు కొత్తగా ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలుండదు.

కొత్త కమిషనర్ల నియామకంపై స్టేకు నో

సెలక్షన్ ప్యానెల్ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని మినహాయించే 2023 చట్టం ప్రకారం కొత్త కేంద్ర ఎన్నికల కమిషనర్ల అపాయింట్‌మెంట్‌పై స్టే ఇవ్వటానికి సుప్రీం కోర్టు శుక్రవారం నిరాకరించింది. జస్టిస్ సంజీవ్‌ఖన్నా, దీపాంకర్ దత్తా, అగస్టన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు చెప్పింది. ఇద్దరు ఈసీల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను మార్చి 21కి ధర్మాసనం వాయిదా వేసింది. ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ (ఏడీఆర్) తరుపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టులో వాదనలు వినిపించారు. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యాన్ని కొనసాగించటానికి ఎన్నికల కమిషన్‌ను రాజకీయ, కార్యనిర్వాహక జోక్యం నుంచి తప్పించాలని వాదిస్తూ ఎంపిక ప్యానెల్ నుండి సీజేఐని తప్పించటాన్ని సవాల్ చేశారు. మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్ సంధు గురువారం ఎన్నికల కమిషనర్లుగా గురువారం నియమితులు కావటం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది.

బాధ్యతలు స్వీకరించిన కమిషనర్లు సుఖ్‌బీర్, జ్ఞానేశ్‌లతో సీఈసీ రాజీవ్‌కుమార్

బాధ్యతలు చేపట్టిన కొత్త ఈసీలు

కొత్త ఎన్నికల కమిషన్ల ఎంపికపై వివాదం ఓ వైపు నడుస్తుండగానే శుక్రవారం జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు ఎన్నికల కమిషనర్లుగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం సీఈసీ రాజీవ్‌కుమార్‌తో వారిద్దరూ భేటీ అయ్యారు. వీరిద్దరిని గురువారం ప్రధాని మోదీ నేతృత్వంలోని సమావేశమైన కమిటీ ఎంపిక చేసింది.

గుర్తుల కేటాయింపుపై మీ వైఖరి తెలపండి: ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం

ఎన్నికల గుర్తుల కేటాయింపులో ప్రతిస్పందనను తెలియజేయాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. గుర్తింపు లేని రాజకీయ పార్టీల్లో మొదట వచ్చిన వారికి నచ్చిన గుర్తు మొదట కేటాయింపు విధానాన్ని సవాల్ చేస్తూ నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) పార్టీ వేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఎన్నికల సంఘం అనుసరిస్తున్న మొదట వచ్చిన వారికి మొదట గుర్తుల కేటాయింపు విధానంపై ఎన్‌టీకే దాఖలు చేసిన పిటిషన్‌ను మార్చి 1న హైకోర్టు కొట్టివేయడంతో దానిని సవాల్ చేస్తూ ఎన్‌టీకే సుప్రీంను ఆశ్రయించింది. ఈ కేసును హోలీ తర్వాత విచారిస్తామని కోర్టు తెలిపింది.

కర్ణాటక మాజీ సీఎంపై పోక్సో కేసు

న్యాయపరంగా ఎదుర్కొంటానన్న యెడియూరప్ప

యెడియూరప్ప

బెంగళూరు, మార్చి 15: బీజేపీ సీనియర్ నేత, కర్ణాటక మాజీ సీఎం యెడియూరప్పపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. తన కుమార్తెపై 81 ఏండ్ల యెడియూరప్ప లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ 17 ఏండ్ల బాలిక తల్లి సదాశివనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. కాగా, తనపై వచ్చిన ఆరోపణలను ఖండించిన యెడియూరప్ప దీనిని న్యాయపరంగా ఎదుర్కొంటానని చెప్పారు. దీనిపై హోంమంత్రి జి పరమేశ్వరన్ మాట్లాడుతూ 'ఫిర్యాదు ఇచ్చిన మహిళ మానసిక స్థితి సరిగా లేదని కొందరు అంటున్నారు. ఫిబ్రవరిలో ఆ మహిళ, ఆమె కుమార్తె యెడియూరప్ప ఇంటికి వెళ్లినప్పుడు ఈ ఘటన చోటుచేసుకుందని ఆ మహిళ ఆరోపిస్తున్నది' అని పేర్కొన్నారు. కాగా, కేసును తదుపరి దర్యాప్తు కోసం సదాశివనగర్ పోలీస్ స్టేషన్ నుంచి సీఐడీకి బదిలీ చేస్తూ డీజీపీ అలోక్ మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు.ఆ మహిళ తనను కలవడానికి చాలాసార్లు ప్రయత్నించినా తాను అనుమతించలేదని యెడియూరప్ప చెప్పారు. ఒకసారి ఏడుస్తుండగా, ఆమెను లోపలికి పిలిచామని, తర్వాత పోలీస్ కమిషనర్ సదానంద్‌తో ఆమె సమస్యను చూడమని చెప్పానన్నారు. అయితే తన ఎదురుగానే తనకు వ్యతిరేకంగా మాట్లాడటం చూసి ఆమె ఏదో తేడాగా ఉందని గ్రహించానన్నారు. బాలిక తల్లి గతంలో అప్పటి బెంగళూరు పోలీస్ కమిషనర్ అలోక్ కుమార్, అతని సిబ్బంది సహా పలువురిపై 50కు పైగా ఫిర్యాదులు చేసినట్టు పోలీస్ వర్గాలు తెలిపాయి.

'బీజేపీని అంతం చేసే శక్తి ఆప్‌కే ఉంది'

వడోదర, మార్చి 15: దేశంలో ఒక్క ఆమ్ ఆద్మీ పార్టీకి మాత్రమే బీజేపీని అంతం చేసే శక్తి ఉందని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. గుజరాత్‌లో శుక్రవారం ఆయన పార్టీ లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. గుజరాత్‌లో తమ పార్టీ పోటీ చేస్తున్న స్థానాల్లో విజయం చేకూర్చాలని ప్రజలను కోరారు. కాగా, ఇండియా కూటమితో ఒప్పందంలో భాగంగా గుజరాత్‌లో ఆప్ రెండు, కాంగ్రెస్ 24 పార్లమెంట్ స్థానాలలో పోటీ పడుతున్నాయి.

ఢిల్లీ మద్యం పాలసీ దర్యాప్తులో కేజ్రీవాల్‌కు చుక్కెదురు

కేజ్రీవాల్‌కు ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టులో శుక్రవారం ఎదురుదెబ్బ తగిలింది. ఈడీ తనపై దాఖలు చేసిన కేసుల విచారణను నిలిపేయాలని ఆయన చేసిన విజ్ఞప్తిని కోర్టు తోసిపుచ్చింది. ఓ ప్రభుత్వ అధికారి జారీ చేసిన సమన్లకు అనుగుణంగా ఆయన వ్యవహరించలేదని ఈడీ కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ మద్యం పాలసీపై దర్యాప్తునకు సంబంధించిన కేసులో కేజ్రీవాల్‌కు ఈడీ ఇప్పటివరకు 8 సమన్లను జారీ చేసింది. కానీ ఆయన ఈడీ అధికారుల విచారణకు హాజరు కాలేదు. ఈ నెల 16న విచారణకు హాజరు కావాలని ఆయనకు అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు సమన్లు ఇచ్చింది. ఈ సమన్లను నిలిపేయాలని ఆయన సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను తోసిపుచ్చడంతో ఆయన ఈ నెల 16న అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుంది.

గేట్-2024 ఫలితాలు నేడు

న్యూఢిల్లీ, మార్చి 15: ప్రసిద్ధ విద్యా సంస్థలలో ఇంజినీరింగ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం, కొన్ని ఎంట్రీ లెవల్ ఇంజినీర్ ఉద్యోగాల స్క్రీనింగ్ కోసం నిర్వహించే గేట్-2024 ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. ఫలితాలను తమ అధికార వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చునని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) బెంగళూరు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అభ్యర్థులు ఫలితాల స్కోర్ కార్డులను ఈ నెల 23 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని ప్రకటించింది.

నీట్ యూజీ పరీక్ష మే 5న

న్యూఢిల్లీ, మార్చి 15: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-యూజీ, 2024 పరీక్ష మే 5న జరుగుతుందని, ఈ నెల 16 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అధికారి ఒకరు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి ఈ నెల 18 నుంచి 20 వరకు అవకాశం ఉందన్నారు.

నిలకడగా మమత ఆరోగ్యం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వ అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు. ఎస్ఎస్‌కేఎం దవాఖానలో ఆమె నుదుటిపై మూడు కుట్లు, ముక్కుపై ఒక కుట్టు వేశారు. అవసరమైన వైద్య పరీక్షలను నిర్వహించిన తర్వాత ఆమెను ఇంటికి పంపించారు. మమత పడిపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆమెను వెనుక నుంచి ఎవరో తోసి ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే కేసు నమోదు చేయడంపై పోలీసులు స్పందించ లేదు.

మ్యాజిక్ ఫిగర్‌ను కాంగ్రెస్ చేరుతుందా?

చెప్పలేమన్న చిదంబరం

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో విజయావకాశాల గురించి సీనియర్ కాంగ్రెస్ నేతలు గట్టిగా విశ్వాసం వ్యక్తం చేయలేకపోతున్నారు. ఓ మీడియా సంస్థ శుక్రవారం నిర్వహించిన కాంక్లేవ్‌లో ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి పీ చిదంబరం మాట్లాడుతూ, ''కాంగ్రెస్ గెలిచే స్థానాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సరిపోతాయా? అంటే, అది నేను చెప్పలేని విషయం'' అని తెలిపారు.

రష్యాలో అధ్యక్ష ఎన్నికలు

తిరువనంతపురంలో పోలింగ్!

మాస్కో: రష్యా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు ఎన్నికల పోలింగ్ కొనసాగనున్నది. ప్రపంచ వ్యాప్తంగా రష్యన్లు తామున్న చోటు నుంచే ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. తిరువనంతపురంలోని రష్యన్ హౌస్ వద్ద ఉన్న పోలింగ్ బూత్‌లో రష్యా పౌరులు, రష్యా పర్యాటకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బీజేపీ బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్ చేయాలి: ఖర్గే

బెంగళూరు, మార్చి 15: ఎన్నికల బాండ్లపై ప్రత్యేక విచారణ జరిపించాలని, విచారణ పూర్తయ్యే వరకు బీజేపీ బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్ చేయాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. 'నేను తినను.. ఎవరినీ తిననివ్వను' అని ప్రధాని మోదీ చెప్తుంటారని, కానీ, ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీ ఎలా డబ్బులు పొందిందనేది ఇప్పుడు బహిర్గతమైందని పేర్కొన్నారు.

బాండ్ల అసలు కోణం బయటపడింది: రాహుల్

ముంబై, మార్చి15: రాజకీయ ఆర్థిక వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ఎలక్టోరల్ బాండ్ విధానాన్ని ప్రవేశపెట్టారని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారని.. కానీ నేడు వాటి వెనుక ఉన్న అసలు కోణాన్ని దేశం అర్థం చేసుకుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. ఎలక్టోరల్ బాండ్ ప్రపంచంలోనే అతిపెద్ద వాయిదాల రికవరీ రాకెట్ అని, రికవరీ కోసం సీబీఐ, ఈడీ, ఐటీని బీజేపీ ఉపయోగిస్తుందని విమర్శించారు. భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద అవినీతిలో ప్రధాని మోదీ హస్తం ఉందని ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు.

ఒక ఈడీ.. ఒకే పార్టీ.. 55 శాతం విరాళాలు

బీజేపీకి వచ్చిన బాండ్లపై మొయిత్రా విమర్శలు

కోల్‌కతా: ఎన్నికల బాండ్ల ద్వారా అత్యధిక విరాళాలను పొందిన బీజేపీపై టీఎంసీ మాజీ ఎంపీ మహువా మొయిత్రా తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఎన్నికల కమిషన్ గురువారం విడుదల చేసిన వివరాల ప్రకారం ఈ బాండ్ల ద్వారా వివిధ పార్టీలకు లభించిన విరాళాల్లో కేవలం బీజేపీకి సుమారు 48 శాతం సొమ్ము చేరడంతో మహువా ఘాటుగా స్పందించారు. ''ఒక దేశం, ఒక గురువు, ఒక ఈడీ, ఒక ఐటీ, ఒక సీబీఐ, ఒకే రాజకీయ పార్టీ. విరాళాల్లో 55 శాతం. మహా అద్భుతం'' అని ఆమె శుక్రవారం ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. మహువా తాను చేసిన ట్వీట్‌లో బీజేపీకి 55 శాతం విరాళాలు వచ్చాయని పేర్కొన్నారు. కానీ ఆ పార్టీకి సుమారు 48 శాతం వరకు విరాళాలు వచ్చినట్లు ఈసీ విడుదల చేసిన సమాచారం ప్రకారం వెల్లడవుతున్నది.

బాండ్ల కొనుగోలుకు.. ఈడీ దాడులకు సంబంధం లేదు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, మార్చి 15: దర్యాప్తు సంస్థల చర్యలకు, బీజేపీకి విరాళాలు ఇచ్చిన సంస్థలపై దాడులు, దర్యాప్తుకు ఎలాంటి సంబంధం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఆ ఆరోపణలు కేవలం ఊహాజనితమైనవని కొన్ని చోట్ల బీజేపీ కన్నా రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతీయ పార్టీలకు ఎక్కువ నిధులు వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు.

మోదీ రోడ్ షోకు మద్రాస్ హైకోర్టు అనుమతి

చెన్నై, మార్చి 15: ఈనెల18న ప్రధాని నరేంద్ర మోదీ కోయంబత్తూరు పర్యటన సందర్భంగా రోడ్ షో నిర్వహించేందుకు మద్రాస్ హైకోర్టు అనుమతినిచ్చింది. నాలుగు కిలోమీటర్ల మేర సాగే ఈ రోడ్‌షోకు షరతులతో కూడిన అనుమతినివ్వాలని మద్రాస్ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. రోడ్‌షోకు అనుమతి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ నేత జే రమేష్‌కుమార్ పిటీషన్ దాఖలు చేశారు. దీన్ని విచారించిన కోర్టు నిరాకరణకు సహేతుకమైన కారణాలు లేవని పేర్కొంది.

సీఏఏకు వ్యతిరేకంగా 237 పిటిషన్లు

మార్చి 19న విచారణకు సీజేఐ అంగీకారం



న్యూఢిల్లీ, మార్చి 15: మోదీ సర్కార్ తీసుకొచ్చిన 'పౌరసత్వ సవరణ చట్టం' (సీఏఏ) అమలును నిలుపుదల చేయాలంటూ సుప్రీంకోర్టులో 237 పిటిషన్లు దాఖలయ్యాయి. ఇండియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) సహా పలువురు పిటిషన్‌దారులు సీఏఏ నోటిఫికేషన్‌లోని పలు నిబంధనల్ని కోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్లు అన్నింటిపైనా ఈ నెల 19న ఒకేసారి విచారణ జరపడానికి సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ అంగీకరించారు.

సీఏఏపై అమెరికా వ్యాఖ్యలు కల్పితం

పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలుపై అమెరికా వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. అమెరికా వ్యాఖ్యల్ని భారత్ తిరస్కరిస్తూ..ఘాటుగా స్పందించింది. 'సీఏఏ అమలుకు సంబంధించి అమెరికా చేసిన ప్రకటన కల్పితం. అనవసరమైందని మేం భావిస్తున్నాం. దేశ విభజన అనంతరం చరిత్రపై పరిమిత జ్ఞానం ఉన్నవారు మాకు ఉపన్యాసాలు ఇవ్వొద్దు' అని భారత విదేశాంగ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. సీఏఏ నోటిఫికేషన్‌పై తాము ఆందోళన చెందుతున్నామని.. మత స్వేచ్ఛ, చట్ట ప్రకారం అన్ని వర్గాల వారిని సమానంగా చూడటం ప్రజాస్వామ్య మూల సూత్రమని అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ గురువారం వ్యాఖ్యానించారు.

సీఏఏ మొబైల్ యాప్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ : పౌరసత్వ సవరణ చట్టం కింద పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రత్యేకంగా ఓ మొబైల్ యాప్‌ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శుక్రవారం ఆవిష్కరించింది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి కానీ, indiancitizenship.nic.in వెబ్‌సైట్ ద్వారా కానీ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపింది. సీఏఏ-2019 మొబైల్ యాప్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని హోం మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ చట్టం ప్రకారం అర్హులు పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఓ పోర్టల్‌ను గతంలోనే ప్రారంభించిన సంగతి తెలిసిందే. సీఏఏ అమలు కోసం నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫై చేసింది.

నీట్-ఎండీఎస్ వాయిదాకు తిరస్కరణ

న్యూఢిల్లీ: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ - మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ (నీట్ ఎండీఎస్, 2024) పరీక్షను వాయిదా వేసేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. షెడ్యూలు ప్రకారం ఈ పరీక్ష ఈ నెల 18న జరగాల్సి ఉండగా, డెంటిస్టులు చిట్ట చివరి క్షణంలో ఈ పిటిషన్‌ను దాఖలు చేశారని వ్యాఖ్యానించింది. నీట్-ఎండీఎస్‌కు అర్హత సాధించడం కోసం ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేయడానికి గడువు ఈ నెల 31 అని, దీనిని పొడిగించాలని పిటిషనర్లు కోరారు. సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై స్పందిస్తూ.. కేంద్రం ఈ గడువును జూన్ 30 వరకు పొడిగించినందు వల్ల ఈ సమస్య పరిష్కారమైందని తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 మధ్య కాలంలో ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేసినవారు ఈ పరీక్షకు దరఖాస్తు చేసేందుకు అర్హులని కేంద్రం స్పష్టం చేసినట్లు ధర్మాసనం గుర్తు చేసింది.

అన్ని జిల్లాల్లో దత్తత ఏజెన్సీలు ఉండాల్సిందే

సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: దేశంలోని 370 జిల్లాల్లో అనాథ పిల్లల దత్తత ప్రక్రియను నిర్వహించాల్సిన ప్రత్యేక దత్తత ఏజెన్సీలు(ఎస్ఏఏ) లేకపోవడం పట్ల సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఎస్ఏఏలపై శుక్రవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అన్ని జిల్లాల్లో ఎస్ఏఏలను ఏర్పాటు చేయాలని తాము 2023 నవంబరు 20న ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇంకా 370 జిల్లాల్లో ఏర్పాటు చేయకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. వెంటనే ఈ జిల్లాల్లో ఎస్ఏఏలను ఏర్పాటు చేయకపోతే తాము తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను హెచ్చరించింది. ఎస్ఏఏల ఏర్పాటు, ఇప్పటివరకు ఎన్ని దత్తతలు జరిగాయి వంటి వివరాలన్నీ ఏప్రిల్ 7 నాటికి కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖకు అందించాలని ఆదేశించింది.

ఆరోపణలు ఉన్న కంపెనీలవే అత్యధిక బాండ్లు

- ఎక్కువ ఎన్నికల బాండ్లు కొన్న ఐదు సంస్థల్లో మూడింటిపై ఈడీ విచారణ
- ఆస్తులు అటాచ్ చేసిన వెంటనే బాండ్లు కొన్న ఫ్యూచర్ గేమింగ్

న్యూఢిల్లీ, మార్చి 15: రాజకీయ పార్టీలకు వచ్చే నిధులపై చాలా రోజులుగా విమర్శలు ఉన్నాయి. పార్టీలకు ఏ సంస్థలు నిధులు ఇస్తున్నాయి ? ప్రతిఫలంగా ఆ సంస్థలు ఆశిస్తున్న ప్రయోజనాలు ఏంటి ? అసలవి ఎలాంటి వ్యాపారం చేస్తాయి ? వాటిపై ఏమైనా ఆరోపణలు ఉన్నాయా ? వంటి వివరాలను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదనే ప్రధాన విమర్శ అన్ని పార్టీలపై ఉంది. ఇప్పుడు ఎస్‌బీఐ వెల్లడించిన ఎన్నికల బాండ్ల వివరాలను పరిశీలిస్తే విమర్శలకు బలం చేకూరుతున్నది. ఎలక్టోరల్ బాండ్లను కొని వివిధ రాజకీయ పార్టీలకు ఇచ్చిన సంస్థలపై పలు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా 2019 నుంచి 2024 మధ్య ఎలక్టోరల్ బాండ్లు ఎక్కువగా కొనుగోలు చేసిన ఐదు సంస్థల్లో మూడింటిపైన ఈడీ, ఐటీ విచారణ జరుగుతున్నది.

ఆస్తులు అటాచ్ చేసిన వెంటనే బాండ్ల కొనుగోలు

ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ గత ఐదేండ్లలో అత్యధికంగా రూ.1,368 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసింది. ఇప్పటివరకైతే ఈ బాండ్లను ఏ పార్టీకి ఇచ్చింది అనే వివరాలు వెల్లడి కాలేదు. అయితే, ఈ సంస్థ ప్రధానంగా లాటరీ వ్యాపారం చేస్తుంది. 2019లో ఈ సంస్థపై ఈడీ విచారణ ప్రారంభించింది. అదే ఏడాది జూలైలో సంస్థకు చెందిన రూ.250 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. 2022 ఏప్రిల్ 2న మరో రూ.409.92 కోట్ల ఆస్తులనూ అటాచ్ చేసింది. ఇది జరిగిన ఐదు రోజులకే ఏప్రిల్ 7న ఈ సంస్థ రూ.100 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది.

మేఘా, వేదాంతపైనా ఈడీ విచారణ

అత్యధికంగా ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసిన జాబితాలో హైదరాబాద్‌కు చెందిన మౌలిక సదుపాయాల కల్పన సంస్థ మేఘా ఇంజినీరింగ్ సంస్థ కూడా ఉంది. ఈ సంస్థ 2019 నుంచి 2024 మధ్యకాలంలో రూ.966 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది. ఈ సంస్థపై 2019 అక్టోబరులో ఐటీ దాడులు జరిగాయి. ఈడీ కూడా ఈ సంస్థపై విచారణ జరుపుతున్నది. ఇక, అత్యధికంగా ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన ఐదో సంస్థ వేదాంత గ్రూప్. గనుల తవ్వకం నిర్వహించే ఈ సంస్థ రూ.376 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసింది. 2019 ఏప్రిల్‌లో మొదటిసారిగా వేదాంత గ్రూప్ ఎన్నికల బాండ్లను కొనుగోలు చేయగా, అంతకు ముందు ఏడాది ఓ కేసులో ఈ సంస్థపై ఈడీ విచారణ జరిపింది.

నల్లధనాన్ని తుడిచిపెట్టడానికే: అమిత్ షా

దేశంలోని నల్ల ధనాన్ని తుడిచిపెట్టడానికే కేంద్రం ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టిందని, అయితే ఇప్పుడు ఈ పథకం రద్దుతో సమాజంలోకి నల్లధనం తిరిగి వస్తుందని ప్రజలు భయపడాలని హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఎన్నికల బాండ్లను రద్దు చేయాలంటూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన అనంతరం తొలిసారిగా షా దీనిపై స్పందించారు. సుప్రీం కోర్టు తీర్పుపై తానెలాంటి వ్యాఖ్యలు చేయదల్చుకోలేదని, అయితే ఎలక్టోరల్ బాండ్ల పథకం, నల్లధనం నిర్మూలనకు దానిని ఎలా ప్రవేశపెట్టింది చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు.

'రాజకీయాలను భ్రష్టు పట్టించేందుకే'

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : రాజకీయాలను భ్రష్టు పట్టించేందుకే మోదీ సర్కార్ ఎలక్టోరల్ బాండ్లను తీసుకొచ్చిందని, ఎస్‌బీఐ అధికారుల వెనుక కేంద్రం పెద్దలున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారంలో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

బాండ్ల పూర్తి వివరాలు ఎందుకివ్వలేదు ?

- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- నోటీసులు జారీ.. అన్ని వివరాలు ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 15: ఎలక్టోరల్ బాండ్ల అంశంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వైఖరిని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించినప్పటికీ ఎందుకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. బాండ్ల నెంబర్లు వెల్లడించకపోతే విషయాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించింది. తమ ఆదేశాలు ఎందుకు పాటించలేదో వివరణ ఇవ్వాలని ఎస్‌బీఐకి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను మార్చి 19కి వాయిదా వేసింది.

THE FEDERAL BANK LIMITED
Regd. Office: Aluva, Kerala.
ZONAL OFFICE: 1st Floor, Halcyon Complex, No.9, St Marks Road, Bangalore-560 001.
e-mail:bgrr-cpc@federalbank.co.in Ph:080-22074610//24/25

BGRR/PvtSale/2023-24 NOTICE FOR PRIVATE SALE OF GOLD 15/03/2024

Notice is hereby given for the information of all concerned that Gold Ornaments pledged in the following Gold Loan accounts, with the under mentioned Branches of the Bank, which are overdue for redemption and which have not been regularized so far in spite of repeated notices, will be put for Private sale, in the respective Branches on any date after 25-03-2024 as shown below:

Br.Hyderabad/Lakadi Ka Pul: Maruthi Plaza, Building No 6-2-981, Beside Shahdan College, Khairatabad, Lakdi Ka Pul, Hyderabad, Telangana-500 004, Ph no. 040-23322966 :-
13326800048005,13326800040234,13326800049755,13326800044905,13326800043709,13326800042982,13326800038642,13326800045225,13326800046645.

Bangalore 15-03-2024 Senior Vice President & Zonal Head